# నీళ్లిచ్చి పంటలను కాపాడండి

- మిడ్‌మానేరు నుంచి టీఎంసీ నీటిని ఎత్తిపోయండి..
- యాసంగి పంట చేతికందే వరకు సాగు నీరివ్వాలి
- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రితో ఫోన్‌లో మాట్లాడిన హరీశ్‌రావు



సిద్దిపేట అర్బన్, మార్చి 1: యాసంగిలో రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయని, సాగునీటిని అందించి పంటలను కాపాడాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని శనివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఫోన్‌లో కోరారు. సిద్దిపేట నియోజకవర్గంలో పంట పొలాలకు సాగునీళ్లు అందక ఎండిపోతున్నాయని, మిడ్ మానేర్ నుంచి రంగనాయకసాగర్‌లోకి నీటిని ఎత్తిపోయాలని కోరారు. నియోజకవర్గంలో గత నాలుగేండ్ల నుంచి యాసంగి పంటలకు రంగనాయకసాగర్ కాల్వల ద్వారా నీటిని అందించామని, ఈసారి కూడా సాగునీటిని అందించాలని విజ్ఞప్తి చేశారు. రంగనాయకసాగర్ కింద పంటల సాగు పెరిగిందని, ఈసారి 50 వేల ఎకరాల్లో పంటలు సాగుచేసినట్లు హరీశ్‌రావు తెలిపారు. రంగనాయకసాగర్‌లో ఇటీవల 2.4 టీఎంసీల నీళ్లు పంపింగ్ చేశారని, ప్రస్తుతం రంగనాయకసాగర్‌లో 1.5 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందన్నారు. యాసంగి పంటకు పూర్తిస్థాయిలో నీరందాలంటే ఇంకో టీఎంసీ నీళ్లు అవసరం ఉంటాయని, మిడ్‌మానేరు నుంచి పంపింగ్ చేసేలా ఇరిగేషన్ అధికారులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. సాగునీళ్లు లేక పంటలు ఎండిపోతుండడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, పంటలు కాపాడి రైతులను గట్టెక్కించాలని విజ్ఞప్తి చేశారు.


నమస్తే తెలంగాణ

సంగారెడ్డి

I హైదరాబాద్, ఆదివారం 2 మార్చి 2025 SANGAREDDY


# ఆనందం వెల్లివిరియాలి

- ముస్లింలకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట, మార్చి 1: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లింలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు శనివారం శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసంలో నిర్వహించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో సామరస్యం, ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత అని పేర్కొన్నారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ముస్లింలు నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలతో నిష్టగా అల్లాను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగిస్తారని పేర్కొన్నారు. అల్లా రక్షణ, కరుణ పొందాలనే లక్ష్యంతో రంజాన్ మాసంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ ప్రతి ఒక్కరూ ఉన్న దాంట్లో ఎంతోకొంత దానధర్మాలు చేస్తారని, సేవా ధృక్పథానికి, సహనానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉంటుందని తెలిపారు. వేసవి నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకొని ఉపవాస దీక్షలు పాటించాలని హరీశ్‌రావు సూచించారు.

# శిఖర ప్రతిష్ఠకు ఆహ్వానం



కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న పాండుగౌడ్, హనుమంతరావు, బట్టు అంజిరెడ్డి తదితరులు.. చిత్రంలో హరీశ్‌రావు కూడా ఉన్నారు.

మర్కూక్, మార్చి 1: సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం పాములపర్తిలో సీతారామ చంద్రస్వామి ఆలయంలో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు జరిగే సుదర్శన చక్ర శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమానికి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావును ఆహ్వానించారు. మాజీ ఎంపీపీ పాండుగౌడ్, ఆలయ వ్యవస్థాపకుడు ఎస్.హనుమంతరావు, డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి శనివారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్, హరీశ్‌రావును కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో బేతి నరేందర్ రెడ్డి, తాండ శ్రీనివాస్ గౌడ్, ఉప్పరి నర్సింగరావు, ఆంజనేయులు, మ్యాకల శ్రీనివాస్ ఉన్నారు.

# చేర్యాల ప్రాంత అభివృద్ధే లక్ష్యం

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



చేర్యాల, మార్చి 1: చేర్యాల ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు ఈజీఎస్ ద్వారా రూ. 2.50కోట్ల నిధులను ఆయన మంజూరు చేయించినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి చేర్యాల మండలానికి రూ.80లక్షలు మంజూరు చేయించానని, ఇందులో చేర్యాల మండలంలోని వీరన్నపేట, దొమ్మాట, చిట్యాల, గుర్జకుంట, దానంపల్లి, ముస్త్యాల, వేచరేణి, నాగపురి గ్రామాలకు రూ.5లక్షల చొప్పున కేటాయించినట్లు తెలిపారు. కాశేగుడిసెలు, కొత్తదొమ్మాట, ఆకునూరు, చుంచనకోట, కడవేర్గు, తాడూరు, పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట, రాంపూర్ గ్రామాలకు రూ.4లక్షల చొప్పున నిధులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. కొమురవెల్లి మండలానికి రూ.70లక్షలు మంజూరు చేయించానని, ఇందులో కొమురవెల్లి, రాంసాగర్, మర్రిముస్త్యాల, గౌరాయపల్లి గ్రామాలకు రూ.7 లక్షల చొప్పున మంజూరు చేయించినట్లు తెలిపారు. ఐనాపూర్, గురువన్నపేట, పోసాన్‌పల్లి, తపాస్‌పల్లి, రసూలాబాద్, లెనిననగర్, కిష్టంపేట గ్రామాలకు రూ. 6లక్షల చొప్పున మంజూరు అయ్యాయి. మద్దూరు మండలానికి రూ.50లక్షలు మంజూరు కాగా, అందులో నర్సాయపల్లి, రేబర్తికి రూ.5లక్షల చొప్పున, సలాక్‌పూర్, మర్మాముల, కమలాయపల్లి, అర్జునపట్ల, ధర్మారం, గాగిళ్లాపూర్, లద్నూర్, మద్దూరు, వంగపల్లి, వల్లంపట్ల గ్రామాలకు రూ.4లక్షల చొప్పున మంజూరు చేయించానని, ధూళిమిట్ట మండలానికి రూ. 50లక్షలు మంజూరు కాగా, అందులో బైరాన్‌పల్లి, ధూళిమిట్ట, లింగాపూర్, కొండాపూర్, దుబ్బతండా, హనుమ తండాలకు రూ.5లక్షల చొప్పున మంజూరు చేయించినట్లు తెలిపారు. కూటిగల్, రెడ్యానాయక్ తండా, జాలపల్లి, బెక్కల్, తోర్నాలకు రూ.4లక్షల చొప్పున మంజూరు చేయించానని, ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నాణ్యతతో గడువులోగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశించారు.

# చివరి మజిలీకి చింతే!

## శ్మశానవాటిక లేక మల్లన్నసాగర్ నిర్వాసితుల ఇక్కట్లు

- ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో దహన సంస్కారాలు చేసేదెలా?
- సమస్యను విన్నవించినా పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నిర్వాసితులు



పునరావాస కాలనీ సమీపంలోని చెరువుకుంట దగ్గర్లో ఒకేచోట ఏర్పాటు చేసిన సమాధులు

గజ్వేల్, మార్చి 1: భూసేకరణతో సర్వం కోల్పోయిన మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అన్ని విధాలుగా వసతులు కల్పిస్తామని చెప్పిన అధికారులు, నిర్వాసితులకు శ్మశాన వాటికలకు స్థలం కేటాయించడంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. శ్మశాన వాటికలకు స్థలం కేటాయించాలని కాలనీల్లో జిల్లా అధికారులు పర్యటించినప్పుడు పలుసార్లు మొరపెట్టుకున్నా తమ గోడు వినడం లేదని, తమ వారు ఎవరైనా మృతిచెందితే కాలనీ సమీపంలోని కుంట పక్కనే దహన సంస్కారాలు చేస్తున్నామని, శ్మశాన వాటిక లేక ఇబ్బందులు పడుతున్నామని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఎన్నిసార్లు విన్నవించినా...

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ సమీపంలో ముట్రాజ్‌పల్లి, సంగాపూర్ గ్రామాల మధ్య 600 ఎకరాల విస్తీర్ణంలో మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాస కాలనీని నిర్మించారు. ఒకేచోట కొండపాక మండలం ఎర్రవల్లి, సింగారం, తొగుట మండలం పల్లెపహాడ్, తండా, వేములఘాట్, ఏటిగడ్డ కిష్టాపూర్, బంజేరుపల్లి, లక్ష్మాపూర్ తదితర గ్రామాల నిర్వాసితుల కోసం కాలనీ నిర్మాణం చేపట్టారు. ఈ గ్రామాల్లో ఎవరైనా మృతిచెందితే వారి దహన సంస్కారాలు చేయడం వారికి తలకుమించిన భారంగా మారింది.



శుక్రవారం గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతున్న ముస్లింలు



శుక్రవారం ఆర్డీవో కార్యాలయ అధికారులతో మాట్లాడుతున్న ఎర్రవల్లి ముస్లింలు

ఎక్కడ చివరి మజిలీ కార్యక్రమాలు పూర్తిచేయాలో తెలియక కాలనీ సమీపంలోని చెరువు కుంట పక్కనే దహన సంస్కారాలు, సమాధులు పెడుతున్నారు. కొద్దిరోజుల క్రితం పల్లెపహాడ్ గ్రామానికి చెందిన ఒకరు మృతి చెందగా, కార్యక్రమాల కోసం కుంట పక్కనే జేసీబీ సాయంతో సమాధి తీస్తుండగా, అందులో నుంచి ఎముకలు రాగా, మరో దాంట్లో కుళ్లిపోయిన మృతదేహం ఆనవాళ్లు కనిపించాయి. ఒకేచోట అన్ని గ్రామాల వారు సమాధులు పెడుతుండడంతో సమస్యగా మారుతున్నది. సమాధిపైనే మరొకరి సమాధి నిర్మాణాలు చేపడుతున్నారంటే సమస్య ఎంతగా ఉందో అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కాలనీలో పర్యటించిన కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీవోలకు పలుసార్లు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరినా ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకోవడం లేదని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు.

### ముస్లింల ఇబ్బందులు

ముస్లింలకు కబ్రస్థాన్ కోసం స్థలాన్ని కేటాయించక పోవడంతో ఆయా గ్రామాల ముస్లింలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొద్దిరోజుల క్రితం లక్ష్మాపూర్‌కు చెందిన అబ్బాస్‌బీ గుండెపోటుతో మృతిచెందింది. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఎక్కడా కబ్రస్థాన్ లేకపోవడంతో గజ్వేల్ పట్టణంలోని కబ్రస్థాన్‌లో కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మృతిచెందిన ముస్లింల చివరి మజిలీ కార్యక్రమాలను చాలా వరకు వారి బంధువుల గ్రామాల్లో నిర్వహించిన సంఘటనలు ఉన్నాయి. శుక్రవారం ఎర్రవల్లికి చెందిన నజియా మృతిచెందడంతో దహన సంస్కారాలు చేసేందుకు స్థలం లేకపోవడంతో గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆమె మృతదేహంతో ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిర్వాసితుల కోసం ఆర్‌అండ్ ఆర్ కాలనీ సమీపంలోనే శ్మశాన వాటికలు, కబ్రస్థాన్‌కు స్థలాన్ని కేటాయించాలని కోరుతున్నారు.

# నేడు ఐఐటీహెచ్‌కు ఉపరాష్ట్రపతి రాక



కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

కంది, మార్చి 1: ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్ ఆదివారం కందిలోని ఐఐటీ హైదరాబాద్‌కు రానున్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తితో కలిసి ఐఐటీలోని హెలిపాడ్, సమావేశ స్థలాన్ని పరిశీలించారు. ఉపరాష్ట్రపతి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రొటోకాల్ నిబంధనల ప్రకారం ఏర్పాట్లను నిర్దేశించాలన్నారు. వీఐపీ పార్కింగ్, ఎమర్జెన్సీ ఎగ్జిట్, హెలిపాడ్ వద్ద భద్రతా ఏర్పాట్లు, ఐడీ కార్డుల పంపిణీ తదితర అంశాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ మాధురి, అదనపు ఎస్పీ సంజీవ్‌రావు, డీఎస్పీ సత్తయ్యగౌడ్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, డీపీవో సాయిబాబా, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మూడంచెల భద్రతా ఏర్పాట్లు: ఎస్పీ

550 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశామని తెలిపారు. హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలు కంది నుంచి శంకర్‌పల్లి మీదుగా వెళ్లాలని, ఆదివారం సాయంత్రం వరకు క్రషర్, మొరం వాహనాలు సంగారెడ్డిలోని అనుమతి లేదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.



ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది



కర్నాల్‌పల్లిలో సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

# విద్యుత్ సమస్య పరిష్కారం

చేగుంట, మార్చి 1: 'తెల్లారిందా కరెంట్ కట్' అని కర్నాల్‌పల్లిలో 15 రోజుల నుంచి ఎదురవుతున్న కరెంట్ సమస్యపై శనివారం 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ట్రాన్స్‌కో జోన్ చీఫ్ ఇంజినీర్ బాలస్వామి, ఎస్‌ఈ శంకర్, డీఈ గరుత్మంత్‌రాజ్, ఏడీఏ అడివయ్య, ఏఈ భరత్ శనివారం కర్నాల్‌పల్లిలో పర్యటించారు. ప్రతిరోజు గ్రామంలో తలెత్తుతున్న విద్యుత్ సమస్య గురించి గ్రామస్తులతో మాట్లాడి తెలుసుకున్నారు. గ్రామంలో ఉదయం విద్యుత్ వినియోగం అధికంగా ఉండడంతో సమస్య తలెత్తున్నట్లు గుర్తించారు. అదనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు కొత్తగా విద్యుత్ స్తంభాలు, వైర్లను బిగింపజేసి సమస్య పరిష్కరించారు. సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కారానికి కృషిచేసిన 'నమస్తే తెలంగాణ'కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# చిరుత కోసం గాలింపు చర్యలు



కొయ్యగుట్ట వద్ద గాలింపు చేపడుతున్న అటవీ, పోలీసు శాఖల సిబ్బంది

రామాయంపేట, మార్చి 1: కొన్ని రోజులుగా చిరుత సంచారం రామాయంపేట మండలంలో భయాందోళనకు గురిచేస్తున్నది. నాలుగు రోజులుగా రామాయంపేట పట్టణ శివారుతో పాటు కేసీఆర్ కాలనీ, గొల్పర్తి, కోమటిపల్లి గ్రామాల సరిహద్దుల్లో చిరుత సంచరించింది. లేగదూడలు, కుక్కలు చిరుత దాడిలో చనిపోయాయి. చిరుత సంచారం పోలీసులు, అటవీశాఖ అధికారులను సైతం ఆందోళనకు గురిచేస్తున్నది. దీంతో శుక్రవారం అర్ధరాత్రి నుంచి వేకువ జాము వరకు రామాయంపేట, ఎస్సైబాలరాజు, ఎఫ్‌ఆర్‌వో విద్యాసాగర్ కలిసి తమ బలగాలతో కేసీఆర్ కాలనీ కొయ్యగుట్ట, గొల్పర్తి, కోమటిపల్లి శివార్లలో ఫోకస్ లైట్లు, సౌండ్ సిస్టంతో గాలింపు చర్యలు చేపట్టారు. అక్కడక్కడ సీసీ కెమెరాలను సైతం చెట్లకు బిగించారు. పొలాలకు రైతులు ఒంటిరిగా వెళ్లవద్దని, ఐదారుగురు కలిసి వెళ్లాలని, చిరుత జాడ తెలిస్తే తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని అటవీ, పోలీస్ అధికారులు సూచించారు. రైతులు తమ పశువులను పొలాల వద్ద ఉంచవద్దని, ఇండ్ల వద్దే కట్టేసుకోవాలన్నారు.

# హరీశ్‌రావుపై అక్రమ కేసులు తగవు



మాట్లాడుతున్న దేవీరవీందర్

గజ్వేల్, మార్చి 1: సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుపై అక్రమ కేసులు తగవని రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు దేవీరవీందర్ అన్నారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, ప్రజల పక్షాన పోరాడుతున్న తెలంగాణ ఉద్యమ నాయకుడు హరీశ్‌రావుపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ కేసులు పెడుతున్న వ్యక్తి చక్రధర్‌గౌడ్ అని గుర్తుచేశారు. అలాంటి వ్యక్తి ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తారా అని ప్రశ్నించారు. చక్రధర్‌గౌడ్‌తో ప్రభుత్వమే అక్రమంగా హరీశ్‌రావుపై కేసులు పెట్టించిందన్నారు. ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టించినా భయపడే వ్యక్తి హరీశ్‌రావు కాదన్నారు. గతంలో కేటీఆర్, కవిత, బీఆర్‌ఎస్ నేతలపై ఎన్నో అక్రమ కేసులు బనాయిస్తున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై కేసులు పెడుతూ ప్రజల్లో మెప్పు పొందాలని చూస్తున్న రేవంత్‌కు ప్రజల నుంచి వ్యతిరేకత మొదలైందన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నేతలు పాల రమేశ్‌గౌడ్, నిజాం పాల్గొన్నారు.

# పార్టీలకతీతంగా పోరాటానికి కలిసిరండి



నర్సాపూర్‌లో రిలే నిరాహార దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు

నర్సాపూర్, మార్చి 1: ప్యారానగర్‌లో జీహెచ్‌ఎంసీ డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా మెదక్ జిల్లా నర్సాపూర్‌లో రిలే నిరాహార దీక్ష కొనసాగుతున్నది. శనివారం నాటికి రిలే నిరాహార దీక్ష 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి డంపింగ్‌యార్డు ఏర్పాటును అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. డంపింగ్‌యార్డు ఏర్పాటైతే ఈ ప్రాంతం అన్నివిధాలుగా నష్టపోతుందని తెలిపారు. ప్రభుత్వం మొండిపట్టు వీడి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షలో జేఏసీ నాయకులు రమణారావు, రాజేందర్, భిక్షపతి, సురేశ్, రమేశ్‌యాదవ్, రామచందర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

గుమ్మడిదల, మార్చి 1: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్ అటవీ ప్రాంతంలో జీహెచ్‌ఎంసీ డంపుయార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ శనివారం రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. గుమ్మడిదల మున్సిపాలిటీలోని అంబేద్కర్ చౌరస్తాలో 19వ రోజు రిలే నిరాహార దీక్షలో వడ్డెర సంఘం సభ్యులు, నల్లవల్లి 25వ రోజు రిలే నిరాహార దీక్షలో కురుమ సంఘం సభ్యులు పాల్గొన్నారు. వీరికి జేఏసీ నాయకులు పూలదండలు వేసి దీక్షను ప్రారంభించారు. దీక్ష నిరంతరం సాగేందుకు వడ్డెర సంఘం, నవజ్యోతి యువజన సంఘం సభ్యులు రూ.5వేల చొప్పున రూ.10 వేలు జేఏసీకి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మూడు చింతల నరేందర్‌రెడ్డి, పుట్ట నర్సింగ్‌రావు, మాజీజడ్పీటీసీ కుమార్‌గౌడ్, నాగేందర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు.తమ ప్రాంతానికి ఇబ్బందికరంగా మారే డంపుయార్డు ఏర్పాటును ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. దీక్షల్లో వడ్డెర సంఘం సభ్యులు ఎల్లయ్య, అశోక్, పాండు, కృష్ణ, సురేశ్, నాగేశ్, నర్సింలు, వెంకటేశ్, యాదమ్మ, లక్ష్మి, జేఏసీ నాయకులు చిమ్ముల నర్సింహారెడ్డి, గోపాల్, ఆంజనేయులు, చంద్రారెడ్డి, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గటాటి రమేశ్, తుడుం శ్రీనివాస్, ఆకుల సత్యనారాయణ, ఉదయ్‌కుమార్, కరుణాకర్, కావలి శంకర్‌యాదవ్, రాంరెడ్డి, సంజీవరెడ్డి, సంతోష్‌రెడ్డి, భిక్షపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నల్లవల్లిలో రిలే నిరాహార దీక్ష చేపట్టిన కురుమ సంఘం కులస్తులు



గుమ్మడిదల: దీక్షలో వడ్డెర సంఘం సభ్యులు, జేఏసీ నాయకులు

# మెదక్ పట్టణాన్ని శుభ్రంగా ఉంచాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



మెదక్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, మార్చి 1(నమస్తే తెలంగాణ): మెదక్ పట్టణంలో శనివారం కలెక్టర్ రాహుల్‌రాజ్ విస్తృతంగా పర్యటించారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులకు స్థలాలను ఆయన గుర్తించారు. పట్టణాన్ని శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ సిబ్బందికి ఆదేశించారు. డ్రైనేజీలు, రోడ్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, రోడ్లపైన ఎక్కడా చెత్త కనిపించకుండా మున్సిపల్ సిబ్బందిని తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట అధికారి మహేశ్ తదితరులు ఉన్నారు.

# విద్యార్థులు ఉత్తమ స్థాయికి ఎదగాలి



సర్టిఫికెట్లు అందుకున్న అగ్రికల్చర్ ఇంజినీరింగ్ విద్యార్థులు

కౌడిపల్లి, మార్చి1: అగ్రికల్చర్ ఇంజినీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ రూరల్ డెవలప్‌మెంట్ జనరల్ సెక్రటరీ కోడె దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం తునికి వద్దనున్న డాక్టర్ డీ. రామానాయుడు విజ్ఞాన జ్యోతి గ్రామీణాభివృద్ధి విద్యాసంస్థ, వ్యవసాయ కళాశాల 21వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఎంటర్‌ప్రైజెస్‌లు ఏర్పాటు చేస్తే తమవంతు రూ.2.50 లక్షల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. చైర్మన్ అచ్యుతారామ ప్రసాద్, డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, న్యూజివీడు సీడ్స్ ప్రతినిధి కృష్ణ, మౌచుమీ కాన్వర్ గోగోయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- నర్సాపూర్ పట్టణంలో విషాదం



వైష్ణవి (ఫైల్)

నర్సాపూర్, మార్చి 1: చదువు ఇష్టం లేక విద్యార్థిని ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. వరంగల్‌కు చెందిన కిశోర్,సునీత దంపతులు కొన్ని రోజుల క్రితం నర్సాపూర్‌లో స్థిరపడ్డారు. వీరి కూతురు వైష్ణవి హైదరాబాద్ నాగోల్‌లోని శ్రీచైతన్య కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నది. నెల క్రితం ఇంటికి వచ్చిన కూతురు వైష్ణవి చదువు ఇష్టం లేదని పలుమార్లు తల్లిదండ్రులకు తెలియజేసింది. నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గురుకులంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తండ్రి కిశోర్ చదువుకోవాలని కూతురిని పలుమార్లు సముదాయించారు. తనను మరలా కళాశాలకు పంపిస్తారన్న భయంతో కూతురు వైష్ణవి శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన నర్సాపూర్ ఏరియా దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వైష్ణవి మృతి చెందినట్లు నిర్ధారించారు. కూతురు మృతితో కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.